# కొప్పుల, సంజయ్‌ను ఆశీర్వదించండి

- ఇద్దరినీ భారీ మెజార్టీతో గెలిపించాలి
- మరోసారి జగిత్యాల నుంచే జైత్రయాత్ర మొదలు కావాలి
- జగిత్యాల, ధర్మపురి బహిరంగ సభల్లో మంత్రి కేటీఆర్

జగిత్యాల, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): రాబోయే ఎన్నికల్లో ధర్మపురి ఎమ్మెల్యేగా మంత్రి కొప్పులను, జగిత్యాల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయకుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని, గులాబీ జైత్రయాత్రను మరోసారి జగిత్యాల నుంచే ప్రారంభించాలని రాష్ట్ర మున్సిపల్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో ₹573 కోట్ల చేసిన పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఆయాచోట్ల నిర్వహించిన సభలకు ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. ఒకవైపు రెండునియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధిని వివరిస్తూనే.. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ అంటే గతం అని, దాని పని ఏనాడో ఖతమైపోయిందని ఎద్దేవా చేశారు. సంక్షేమం విషయంలో ఆ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో, దేశంలో 60ఏండ్ల పాటు 11 సార్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ రైతుల కోసం ఒక్క మంచి పనైనా చేసిందా..? చెప్పాలన్నారు. రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్ గురించి ఏనాడూ ఆలోచించని కాంగ్రెస్, నేడు అన్నీ ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ విషయాన్ని రైతులు ఒకసారి ఆలోచించాలన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ బీడీ కార్మికులకు పెన్షన్ ఇవ్వడం లేదని, సీఎం కేసీఆర్ ఇస్తున్నారన్నారు. టేకేదారులకు సైతం పెన్షన్ ఇస్తున్నామన్నారు. ముసలినక్క కాంగ్రెస్ మాటలు నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మోడీ మాటలు కోటల్లా ఉంటే.. చేతలు పకోడీల్లా ఉంటాయని ఎద్దేవా చేశారు. ఆయన మతం పేరిట యువకులను ఆగం చేస్తున్నారని, జనధన్ ఖాతాల్లో ₹15లక్షలు వేస్తామని చెప్పి పారిపోయారన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న మోడీ, ఆ తర్వాత మాట తప్పారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో ప్రజలను మోసం చేసిన బీజేపీకి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ గుండు లెక్క గుండు సున్నా ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు.



జగిత్యాల సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

### జగిత్యాలను అగ్రగామిగా తీర్చిదిద్దే బాధ్యత నాదే

జగిత్యాలకు గతంలో ప్రాతినిధ్యం వహించిన వారు, మంత్రులుగా చేసిన వారు సైతం జగిత్యాలను జిల్లాగా మార్చలేకపోయారని, మెడికల్ కాలేజీ, ఎస్పీ కార్యాలయాలను తీసుకురాలేకపోయారని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. కానీ సీఎం కేసీఆర్ పాలనలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వాటిని సాధించడంలో విజయం సాధించారని చెప్పారు. జూనియర్, డిగ్రీ కాలేజీల కోసం పోరాటాలు చేసిన జగిత్యాల వాసులు, ఏనాడైనా మెడికల్ కాలేజీ తమ పట్టణంలో ఏర్పాటు చేస్తారని భావించారా..? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కృషి, సీఎం కేసీఆర్ దయతో జగిత్యాలకు మెడికల్ కాలేజీ వచ్చిందన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కొంత ముక్కుసూటి మనిషి అని, అప్పుడప్పుడు కోపానికి వస్తారని, ప్రజల కోసం నిబద్ధతతో పనిచేసే వారికి ఆ మాత్రం కోపం ఉండడం సహజమేనన్నారు. ప్రజలు దీన్ని అర్థం చేసుకోవాలని కోరారు. సంజయ్‌కుమార్ డాక్టర్‌గా ఎన్నో సేవలు అందించారని, జిల్లాలో ఆయన కంటి ఆపరేషన్ చేయని ఊరు ఉన్నదా..? అంటూ ప్రజలను ప్రశ్నించారు. ఆయన సేవాభావాన్ని గుర్తించే సీఎం కేసీఆర్ పిలిచి బీఆర్ఎస్ అభ్యర్థిగా అవకాశం కల్పించారన్నారు. సీఎం కేసీఆర్ కల్పించిన అవకాశాన్ని ప్రజలు సైతం ఆమోదించి, 60వేలకు పైచిలుకు ఓట్లతో సంజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. ప్రజామోదంతో గెలిచిన సంజయ్‌కుమార్ సైతం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం శ్రమించారన్నారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి పనులను ప్రజలు గమనించాలన్నారు. మరోసారి జగిత్యాల ఎమ్మెల్యేగా సంజయ్‌కుమార్‌ను 75వేల మెజారిటీతో గెలిపించే బాధ్యతను ప్రజలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామి తీర్చిదిద్దే బాధ్యతను తాను తీసుకుంటానని ప్రకటించారు. నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి కోసం అడిగిన ప్రతి అంశాన్ని పరిష్కరిస్తానని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు మహమూద్ అలీ, మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సుంకె రవిశంకర్, మండలి చీఫ్ విప్ భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు రమణ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌రావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ మంత్రి రాజేశం గౌడ్, కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, జగిత్యాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ ఎగ్గడి భాస్కర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, అదనపు కలెక్టర్లు బీఎస్ లత, టీఎస్ దివాకర, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మోర హన్మాండ్లు, అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు రవీంద్రకుమార్, వెంకటస్వామి, రవీంద్రరెడ్డి, వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వర్‌రావు, నటేశ్, ఆరిఫ్‌అలీఖాన్, కోటేశ్వర్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్లు అడ్వాల జ్యోతి లక్ష్మణ్, ఆవారి శివకేసరిబాబు, బొడ్ల రాజు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సింగిల్‌విండో చైర్మన్లు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ గతం.. దాని పనైపోయింది

అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయని కాంగ్రెస్ వాళ్లు, ఇప్పుడు చేస్తామనడం విడ్డూరంగా ఉన్నది. 'తల్లికి అన్నం పెట్టని వాడు, పిన్నతల్లికి బంగారు గాజులు చేయిస్తాను' అన్నట్లున్నది ముచ్చట. ఏ వస్తువుకైనా వారంటీ ఉంటుంది. 150 ఏండ్ల కాంగ్రెస్ పార్టీకి వారంటీ లేదు. అలాంటి పార్టీ గ్యారెంటీలు ఇస్తే నమ్ముతారా..? ముసలినక్క కాంగ్రెస్‌ను నమ్మితే ఆరు గ్యారెంటీల సంగతి దేవుడెరుగు? అధికారంలోకి వస్తే అంధకారం గ్యారంటీ. 24గంటల కరెంట్ కాదు, మూడు గంటల కరెంట్ మాత్రం పక్కా. కాంగ్రెస్ అంటే గతం అని, దాని పని ఏనాడో ఖతమైంది.

*- జగిత్యాలలో మంత్రి కేటీఆర్*

### కాంగ్రెస్, బీజేపీ కబోధులు



సమైక్యపాలనలో ధర్మపురి నియోజకవర్గాన్ని పూర్తిగా వెనుకబడ్డది. అభివృద్ధికి ఆమడదూరంలో చీకట్లో మగ్గింది. కానీ స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్, పురపాలక శాఖ మం త్రి కేటీఆర్ ఆశీస్సులతో అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపాం. ఇక్కడి పనులను చూస్తే ఎంతో గర్వంగా ఉం ది. 2003 గోదావరి పుష్కరాల సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ధర్మపురిలో యజ్ఞం చేశారు. ఈ ప్రాంతం నుంచే తెలంగా ణ ఉద్యమానికి మూలం పడింది. 2009లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీర్వాదంతో ధర్మపురి ప్రాంతానికి వచ్చిన సందర్భంలో నియోజకవర్గ పరిస్థితి దయనీయ స్థితి లో ఉండేది. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఆనాడే అనుకున్న. ధర్మపురి పట్టణానికి సంబంధించి దేవస్థానం, టెంపుల్ సిటీ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించిన. మేజర్ పంచాయతీగా ఉన్న ధర్మపురిని మున్సిపాల్టీగా అప్‌గ్రేడ్ చేయించిన. ఇలా విడతల వారీగా నిధులు మంజూరు చేయిస్తూ గొప్పగా అభివృద్ధి చేసిన. ఇంకా వంద కోట్ల పైచిలుకు నిధులతో బ్రహ్మాండంగా నడుస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయి లింక్ కాలువల ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరందుతున్నది. ఈ ప్రాంత ప్రగతిని జీర్ణించుకోలేక కాంగ్రెస్, బీజేపీలు అసత్యప్రచారం చేస్తున్నారు..? అభివృద్ధి ఎక్కడ జరిగిందని అంటున్నరు. వాళ్లు కళ్లుండీ చూడలేని కబోధులు. వారి మాటలు నమ్మితే మోసపోవడం ఖాయం. తెలంగాణలో అద్భుత ప్రగతిని సాధించిన మహానాయకుడు కేసీఆర్. ఆయనకు తోడు, తండ్రికి తగ్గ తనయుడు మంత్రి కేటీఆర్. దేశవిదేశాల్లో కేటీఆర్ అంటే ఒక బ్రాండ్. ఒక అభివృద్ధి, ఒక ధైర్యం. కేటీఆర్ అంటే ఒక సత్యం. రూ.4లక్షల కోట్ల పెట్టుబడులు, వేలాది కంపనీలను తీసుకువచ్చి దాదాపు 18లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించిన గొప్ప నేత కేటీఆర్.

*- ధర్మపురిలో మంత్రి కొప్పుల ఈశ్వర్*

# ధర్మపురి ధర్మరాజు మా ఈశ్వరన్న

- నేను ఆయనకు పెద్ద అభిమానిని..
- ధర్మపురిలో ఈశ్వరన్న గెలిస్తే ధర్మం గెలిచినట్టే..
- ప్రగతి నివేదన సభలో మంత్రి కేటీఆర్ ప్రశంసలు

కరీంనగర్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): 'మా కొప్పుల ఈశ్వరన్న ధర్మపురి ధర్మరాజు. సౌమ్యుడు మృధుస్వభావి' అని మంత్రి కేటీఆర్ కొనియాడారు. ఒక నిరుపేద కుటుంబంలో పుట్టి, సింగరేణి కార్మికుడిగా ఉద్యోగంలో చేరి ఆ తర్వాత కేసీఆర్ చొరవతో రాజకీయాల్లోకి వచ్చి ఇంత దూరం రావడం గొప్ప విషయమన్నారు. తాను పుట్టిన 1976 సంవత్సరంలోనే ఈశ్వరన్న సింగరేణిలో కార్మికుడిగా చేరి, 26 ఏండ్లు పనిచేశారని, అంచలంచెలుగా ఎదిగారని చెప్పారు. కేసీఆర్ ఆశీస్సులతో రాజకీయాల్లోకి వచ్చారని, ఉద్యమం నుంచి ఆయన వెంట నడుస్తూ ఎంతో ఎత్తుకు ఎదిగారని చెప్పారు. మంగళవారం ధర్మపురి పట్టణంలోని కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన ప్రగతి నివేదన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కొప్పుల ఈశ్వరన్నకు తాను పెద్ద అభిమానని, ఈ విషయంలో ధర్మపురికి వచ్చిన సందర్భంగా చెప్పడం లేదని, తన సహచర మంత్రులు, ఎమ్మెల్యేలతో అనేక సార్లు చెప్పానని గుర్తు చేశారు. దీనికి పెద్ద కారణం ఉదని కూడా మంత్రి కేటీఆర్ వివరించారు. తెలంగాణ రాక ముందు 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తమ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసిందని, ఆ సమయంలో ఒక పత్రిక ఈశ్వరన్నకు దగ్గరికి వెళ్లి ఈ విషయాన్ని ప్రస్తావించినచిప్పుడు ఆయన చెప్పిన మాటలు ఇప్పటికీ తనకు గుర్తున్నాయని, అవి ఎన్నటికీ మరిచిపోలేనని గుర్తు చేసుకున్నారు. 'నేను ఇప్పుడు, ఎప్పుడు కేసీఆర్ వెంటే ఉంటా. చచ్చేంత వరకు ఆయన వెంటే నడుస్తా. ఒక వేళ ఏవైనా కారణాలు ఉండి కేటీఆర్, హరీశ్ ఇతర పార్టీలకు వెళ్లినా నేను కేసీఆర్ వెంటే ఉంటా' అని ఈశ్వరన్న చెప్పిన మాటలు తన హార్ట్‌ను టచ్ చేశాయని చెప్పారు. అప్పటి నుంచి నేను ఈశ్వరన్నకు అభిమానిగా మారిపోయానని గుర్తు చేశారు. పనులు చేయించుకోవడంలో గాని నిధుల మంజూర్‌లో గాని, ప్రజలు నాయకులతో కొప్పుల చూపే వినయ విదేయతలు అతని ఉన్నతిని ప్రతిబింభిస్తాయన్నారు. ఈశ్వరన్నను ధర్మపురి ధర్మరాజు అనడంలో సరైనదే నన్న అభిప్రాయపడ్డారు. చెరువు నిండిన తర్వాత కప్పలు మస్తుగ వస్తాయని, పార్టీ ఆపదలో ఉన్నప్పుడు వెన్నంటి ఉన్న వారికే గొప్ప గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఈశ్వరన్నతో ఎప్పుడు సమస్యలు రావని, ఎప్పుడు చూసినా చిరునవ్వుతో కనిపించే మృధు స్వభావి అని అభినందించారు. ధర్మపురిలో ఆయన గెలవడం అంటే ధర్మం గెలిచినట్టేనని స్పష్టం చేశారు. ఈ సారి కూడా యాభై, అరవై వేల ఓట్ల మెజార్టీతో ఆయనను గెలిపించుకుంటేనే ధర్మం గెలిచినట్లని అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో కేవలం 40 వేల ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందేదని, కొప్పుల చేసిన కృషితో 13 రకాల ఎత్తిపోతల పథకాలు రావడంవల్ల ఇపుడు నియోజవర్గంలో 1.26 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతున్నదన్నారు. ఈశ్వరన్న అడిగిన 48 గంటల్లోనే సీఎం కేసీఆర్ ధర్మపురికి వ్యవసాయ కళాశాలను మంజూరు చేశారని కేటీఆర్ వెల్లడించారు. ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావించాలని, తమ దగ్గర పరిశ్రమలు లేవని, ఒక మంచి పరిశ్రమను ఇవ్వాలని ఈశ్వరన్న సీఎం కేసీఆర్‌ను కోరగానే ఇథనాల్ పరిశ్రమను మంజూరు చేశారని, వెల్గటూర్ మండలంలో ఈ పరిశ్రమను స్థాపించేందుకు ₹750 కోట్లు కూడా కేటాయించడం జరిగందని, కాంగ్రెస్ నాయకులు కాళ్లల్లో కట్టె పెట్టినట్లు ఈ పరిశ్రమ స్థాపనను అడ్డుకున్నారని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇప్పుడు అదే స్థలంలో ఈ వ్యవసాయ కళాశాలను నిర్మిస్తున్నామని, ఇది కూడా ఎందరో నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ రోజు ఈ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈశ్వరన్న కోరకున్నా ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూసిన తర్వాత మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంలో ధర్మపురి పట్టణానికి మరో ₹25 కోట్లు మంజూరు చేస్తానని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు.

### రాష్ట్ర మోడల్‌ను దేశం కోరుకుంటోంది



ఒకనాడు అధ్వానంగా ఉన్న తెలంగాణ స్వరాష్ట్రంలో ప్రగతి పథంలో నడుస్తున్నది. అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. ఈ రోజు తెలంగాణ అభివృద్ధి మోడల్‌ను దేశమంతా కోరుకుంటోంది. సీఎం కేసీఆర్ తొమ్మిదన్నరేండ్ల పాలనలో అన్ని రంగాల్లో ఎంతో పురోగతి సాధించింది. ఇటు అభివృద్ధితో పాటు సకల జనుల సంక్షేమంలో నంబర్ వన్‌గా నిలిచింది. రాష్ట్రంలోని ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అంది ప్రజలు ఆనందంగా ఉన్నరు. పేదరికాన్ని తగ్గించి ప్రజల ఆదాయం పెంచడంలో ప్రభుత్వ కృషి ఉంది. ఐటీ మంత్రి కేటీఆర్ కృషితో ప్రపంచ దేశాల కంపెనీలు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. యువతకు ఉద్యోగాలు లభిస్తున్నాయి. రాష్ట్ర భవిష్యత్ కేటీఆర్. ధర్మపురి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దిన గొప్ప నాయకుడు మంత్రి కొప్పుల ఈశ్వర్. ఆయన ధర్మపురికి ధర్మరాజుగా నిలిచాడు.

*-ధర్మపురిలో పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేతకాని*

నమస్తే తెలంగాణ CLASSIFIED

కావలెను

★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15–22 వేలు. ఏజెంట్లకు 5000/– కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-310380-All

CHANGE OF NAME

★ I, AYLNENI GANGARAO S/o. AYLNENI RAMARAO R/o. 3-63/1, Vill, POTHARAM, Mandal- MALLIAL, JAGITYAL -Dist , TS. Changed My Surname As AILNENI GANGARAO S/o. AILNENI RAMARAO.
NT-318144

★ We SYED MUNAWAR AHMED & ASFIA BEGAM, R/o. 7-3-264/A, Kashmeer gadda, Karimnagar, TS, Changed our daughter's from SYEDA ASGHARI ASNA FATHIMA to SYEDA FATHIMA
NT-318143

★ I, MOHAMED MAQBOOL HUSSAIN, S/o. FATHEY MOHAMMAD, R/o. 7-3-189, Kashmeergadda, Karimnagar, T.S. changed my name as MOHAMMED MAQBOOL HUSSAIN S/o. FATHEY MOHAMMAD
NT-318143

★ I, Konda Narayana S/o. Limba Goud R/o. 7-51, Gollapalle, Rajanna Sircilla TS. have Changed My Name As Konda Narayana Goud S/o. Limba goud
NT-318143

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

